ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక


ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :120 మంగళవారం ఫిబ్రవరి 24 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

## తెలంగాణ ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు
- 9,97,075 మంది విద్యార్థులు హాజరు
- 30 వేల సీసీ కెమెరాల నిఘాలో నిర్వహణ



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు జరగనున్న పరీక్షల నిర్వహణపై ఇంటర్ బోర్డు కార్యదర్శి, ఐఏఎస్ అధికారి కృష్ణాదిత్య కీలక వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది మొత్తం 9,97,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా, మొదటి సంవత్సరం నుంచి 4,89,126 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,07,949 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 404 ప్రభుత్వ కళాశాలలు, 221 ఎయిడెడ్ కళాశాలలు, 863 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, 7 ఇతర విద్యాసంస్థలను ఎంపిక చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రైవేట్ కళాశాలలు అధికంగా ఉండగా, మిగతా జిల్లాల్లో ప్రభుత్వ కళాశాలలకు ప్రాధాన్యత ఇచ్చారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా దాదాపు 30 వేల సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి కేంద్రంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని, విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని సూచించారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని, అయితే సమయపాలన పాటించాలని విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులను బయటకు పంపబోమని, ప్రశ్నాపత్రాలు కూడా బయటకు వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హాల్ టికెట్ల వివాదాలపై స్పందిస్తూ, ఫీజులు చెల్లించలేదనే కారణంతో ఎవరినీ ఇబ్బంది పెట్టబోమని తెలిపారు. కోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు కూడా హాల్ టికెట్లు జారీ చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 28,500 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో ఉంటారని, విద్యుత్, రవాణా, పోలీస్ శాఖల సమన్వయంతో అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు కృష్ణాదిత్య వెల్లడించారు.

## రైతు సంఘర్షణ సభలో కల్వకుంట్ల కవిత ఘాటు వ్యాఖ్యలు

- కలెక్టరేట్ ముట్టడి, వినతిపత్రం అందజేత
- సీడ్ పత్తి రైతుల బకాయిల విడుదలకు డిమాండ్
- రుణమాఫీ, రైతు భరోసాపై ప్రభుత్వంపై విమర్శలు





జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 23 (మనప్రజాప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతు సంఘర్షణ సభలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. సభ అనంతరం రైతుల సమస్యలపై వినతిపత్రం ఇవ్వడానికి పెద్ద ఎత్తున రైతులతో కలిసి కలెక్టరేట్‌కు బయలుదేరారు. పోలీసుల అనుమతి లేదని గేటుకు తాళం వేయడంతో కవితతో పాటు రైతులు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సభలో మాట్లాడుతూ నాగర్ కర్నూల్ ఘటనలో చిన్నారి మృతి బాధాకరమని పేర్కొంటూ మౌనం పాటించాలని కోరారు. తెలంగాణలో కుల వివక్షకు తావు లేకూడదని స్పష్టం చేశారు. జోగులాంబ అమ్మవారిపై తనకు ప్రత్యేకమైన భావోద్వేగం ఉందని, భవిష్యత్ కార్యక్రమాలను గద్వాల్ నుంచే ప్రారంభిస్తామని ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్రను గుర్తుచేసి, రాబోయే సామాజిక ఉద్యమంలో కూడా వారు ముందుండాలని విజ్ఞప్తి చేశారు. సీడ్ పత్తి రైతుల బకాయిలు వారం రోజుల్లో విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, లేదంటే దీక్షకు దిగుతామని హెచ్చరించారు. అర్ధరాత్రి కరెంట్ సరఫరా, యూరియా కొరత, యాప్ ద్వారా బుకింగ్ వంటి అంశాలపై ప్రభుత్వాన్ని విమర్శించారు. రైతుల రుణమాఫీ విషయంలో పూర్తి న్యాయం జరగలేదని, ఇంకా 15 లక్షల మంది రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రతి రైతుకు రుణమాఫీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కృష్ణమ్మ, తుంగభద్ర నదులు ప్రవహిస్తున్నా నడిగడ్డకు నీళ్లు అందడం లేదని, తుమ్మిళ్ల, నెట్టెంపాడు పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ ప్రాంతానికి న్యాయం చేయలేకపోయాయని అన్నారు. రైతుల కోసం పోరాడే నాయకత్వం అవసరమని, త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో జాగృతి బలంగా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. రైతులు, మహిళల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానని కవిత తెలిపారు.

## పార్కుల కబ్జాలపై ఫిర్యాదుల వెల్లువ

- హైడ్రా ప్రజావాణికి 59 వినతులు
- చెరువులు, పార్కులు, ప్రజా స్థలాల పరిరక్షణ డిమాండ్
- క్షేత్రస్థాయి పరిశీలనకు కమిషనర్ హామీ








హైదరాబాద్, ఫిబ్రవరి 23 (మనప్రజాప్రతినిధి): పార్కుల కబ్జాలు, చెరువుల ఆక్రమణలపై హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ వచ్చింది. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 59 వినతులు అందాయి. పార్కులు, ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములను అక్రమంగా ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని పలు ప్రాంతాల నివాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. లేఅవుట్లలో గిఫ్ట్ డీడ్ ద్వారా పార్కులు, ఓపెన్ స్పేస్‌లు కేటాయించినప్పటికీ తరువాత అవి ప్లాట్లుగా మారిపోతున్నాయని ఫిర్యాదులు వచ్చాయి. రంగారెడ్డి జిల్లా సాహెబ్‌కళాన్‌లో ఓపెన్ బావి ఉన్న భూమిని పూడ్చి ప్లాట్లుగా విక్రయించారని నివాసితుల సంక్షేమ సంఘం ఫిర్యాదు చేసింది. అమీన్‌పూర్‌లో పార్కు భూమిని కాపాడిన కాలనీ వాసులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అభినందించి శాలువాతో సన్మానించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో చర్లపల్లి, గాజులరామారం, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో పార్కు భూములపై కబ్జాలు జరుగుతున్నాయని నివాసితులు ఫిర్యాదు చేశారు. మియాపూర్‌లో నాయమ్మకుంట పక్కన ఉన్న పార్కు భూమిని రక్షించాలని కాలనీ సంఘం కోరింది. అమీన్‌పూర్ బందంకొమ్ము గ్రామంలో శ్మశానవాటిక, నీటి ట్యాంకు, మహిళాభవనం స్థలాలపై రియల్ ఎస్టేట్ సంస్థలు ఆక్రమణలు చేస్తున్నాయని ఆరోపించారు. మహేశ్వరం పరిధిలో నాదర్గుల్ గ్రామంలో చెరువులకు వెళ్లే వరద కాలువలు కబ్జాలకు గురవడంతో ప్రతి ఏడాది వరద ముంపు సమస్య తలెత్తుతోందని గ్రీన్ హిల్స్ కాలనీ వాసులు పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులన్నింటినీ పరిశీలించిన కమిషనర్ ఏవీ రంగనాథ్ సంబంధిత అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ, కొన్ని కేసులను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. గతంలో పార్కులను కాపాడినందుకు కృతజ్ఞతలు తెలిపిన పౌరులను కమిషనర్ సన్మానించారు. ప్రజా స్థలాల పరిరక్షణకు హైడ్రా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## జోగిపేట వాసికి జీవనాధార పరికరాల అందజేత



- ఊపిరితిత్తుల రోగితో బాధపడుతున్న మల్లేశంకు సహాయం
- ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి మంత్రి అండ
- ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యం

జోగిపేట, ఫిబ్రవరి 23 (మన ప్రజా ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని మరోసారి చాటిచెప్పారు. జోగిపేట 16వ వార్డుకు చెందిన గంజి మల్లేశం దీర్ఘకాలంగా తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న విషయం మంత్రి దృష్టికి రావడంతో వెంటనే స్పందించి అవసరమైన వైద్య పరికరాలను అందజేశారు. గంజి మల్లేశం కుటుంబం ఇప్పటికే లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రతినెలా పది వేల రూపాయల వ్యయంతో ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్, బైప్యాప్ యంత్రాన్ని అద్దెకు తీసుకుంటూ చికిత్స కొనసాగిస్తోంది. ఈ పరిస్థితిని గమనించిన మంత్రి, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి ప్రభుత్వం తరఫున పూర్తి సహాయం అందించాలని నిర్ణయించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సోమవారం మినిస్టర్ నివాస సముదాయంలో మంత్రి దామోదర రాజనర్సింహ స్వయంగా గంజి మల్లేశం కుటుంబ సభ్యులకు ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్, బైప్యాప్ యంత్రాన్ని అందజేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందనే సందేశాన్ని ఈ చర్య స్పష్టం చేసింది. ఈ సందర్భంగా మల్లేశం కుటుంబ సభ్యులు మంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మరోసారి పేర్కొన్నారు



## పెళ్లి పేరుతో కొత్త తరహా మోసాలు

- నిశ్చితార్థం తర్వాత కూడా అప్రమత్తంగా ఉండాలి: పోలీస్ కమిషనర్ సజ్జనార్
- ఎమోషనల్ బ్లాక్‌మెయిల్, అదనపు కట్నం డిమాండ్లపై హెచ్చరిక
- షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయాలని సూచన

2

## రాజమండ్రి కల్తీ పాల ఘటనపై వైఎస్ షర్మిల ఆందోళన

- బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి
- ఉన్నత స్థాయి దర్యాప్తు కమిటీ నియామకానికి డిమాండ్

2

# పెళ్లి పేరుతో కొత్త తరహా మోసాలు

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (మన ప్రజా ప్రతినిధి): పెళ్లి పేరుతో జరుగు తున్న కొత్త తరహా మోసాలు నగరంలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. కేవలం ప్రేమ వ్యవహారాల్లోనే కాకుండా, పెద్దలు కుదిర్చిన సంబంధాల్లో కూడా యువతులు మోసపోతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నా యని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. నిశ్చితార్థం జరిగిన తర్వాత కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోసగాళ్లు తమ పంథాను మార్చుకున్నారని ఆయన తెలిపారు. ముందుగా సంప్రదాయ బద్ధంగా పెళ్లి చూపులు, నిశ్చితార్థం జరిపిం చుకుని విశ్వాసం పొందుతున్నారని చెప్పారు. ఆ తర్వాత పెళ్లి ఖాయమైందన్న చనువును ఆసరాగా చేసుకుని యువతులతో సన్నిహి తంగా మెలిగి, మాయమాటలతో ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తూ శారీరకంగా లోబరుచుకునే ఘటనలు నమోదవుతున్నాయని వెల్లడించారు. పెళ్లి సమయం దగ్గర పడిన తర్వాత అదనపు కట్నం కోరుతూ, ఇవ్వకపోతే పెళ్లి రద్దు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. సమాజంలో పరువు పోతుందనే భయంతో చాలా మంది బాధితులు ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారని, ఈ మౌనాన్ని ఆసరాగా చేసుకుని మోసగాళ్లు మరింతగా రెచ్చిపోతున్నారని షీ టీమ్స్ గుర్తించాయని చెప్పారు. నిశ్చితార్థం జరిగినంత మాత్రాన గుడ్డిగా నమ్మకుండా, అబ్బాయి ప్రవర్తన, స్నేహితులు, అలవాట్లపై ముందుగానే ఆరా తీయాలని సూచించారు. ముఖ్యంగా పెళ్లికి ముందే శారీరక సంబంధం కోసం ఒత్తిడి చేస్తే అది ప్రమాద సంకేతమని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలకు గురైన వారు భయపడకుండా ముందుకు రావాలని, బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామని కమిషనర్ భరోసానిచ్చారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 9490616555 కు లేదా అత్యవసరంగా 100 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

# రాజమండ్రి కల్తీ పాల ఘటనపై వైఎస్ షర్మిల ఆందోళన

మెదటి పేజీ తరువాయి




రాజమండ్రి, ఫిబ్రవరి23(మన ప్రజా ప్రతినిధి): రాజమండ్రిలో కల్తీ పాల ఘటన తీవ్ర భయాందోళనకు గురిచేసిందని వైఎస్ షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. విషపు పాలు తాగి రెండు రోజుల్లో అయిదుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. కిడ్నీ సమస్యలతో ఎనిమిది మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, ప్రభుత్వం తక్షణం బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఆసుపత్రుల్లో ప్రాణాలతో పోరాడుతున్న వారికి మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. కల్తీ పాల సరఫరా వెనుక ఉన్న వాస్తవాలను నిగ్గుతేల్చాలని, ఉన్నత స్థాయి కమిటీని నియమించి దర్యాప్తు ముమ్మరం చేయాలని కోరారు. బాధితుల సంఖ్య మరింత పెరగకుండా వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య భద్రత విషయంలో ప్రభుత్వం మరింత అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్ షర్మిల స్పష్టం చేశారు.

# ఏసీబీ దూకుడు
## పోలీస్ స్టేషన్‌లోనే రూ.3 లక్షల లంచం స్వీకరణ

- కడప జిల్లాలో సీఐ, ఎస్ఐ అరెస్ట్
- శ్రీకాకుళం, విజయనగరంలోనూ అవినీతి అధికారుల పట్టివేత
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు




అమరావతి, ఫిబ్రవరి 23 (మనప్రజాప్రతినిధి): ఆంధ్ర ప్రదేశ్‌లో అవినీతి నిరోధక శాఖ అధికారులు దూకుడు పెంచారు. వైఎస్సార్ కడప జిల్లాలో పోలీస్ స్టేషన్‌లోనే రూ.3 లక్షలు లంచం తీసుకుంటున్న ఇద్దరు పోలీసు అధికారులను సోమవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు. ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది. పులివెందుల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.వి. రమణ, సింహాద్రిపురం సబ్ ఇన్‌స్పెక్టర్ దాసరి అనిల్ కుమార్ చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి నుంచి రూ.4 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కేసులో అనుకూలంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చిన వారు కొంత మొత్తం తీసుకున్న తర్వాత మిగతా డబ్బు కోసం ఒత్తిడి చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో పక్కా ప్రణాళికతో వలపన్ని, బాధితుడు రూ.3 లక్షలను అందజేస్తుండగా ఎస్ఐ అనిల్ కుమార్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న సీఐ రమణను కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఇక శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడి నుంచి రూ.10 వేల లంచం తీసుకుంటున్న మండల విద్యాధికారి కుర్మాన అప్పారావు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉప్పాడ కామేశ్వరరావును ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం సవరవిల్లి గ్రామ రెవెన్యూ అధికారి ఆర్. చిట్టిబాబు కూడా లంచం స్వీకరిస్తూ చిక్కారు. అవినీతి అధికారులపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు.

# కల్తీ పాల మరణాలపై జగన్ దిగ్భ్రాంతి

- ఐదుగురు మృతి, పలువురి అస్వస్థతపై ఆందోళన
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి
- బాధ్యులపై కఠిన చర్యల డిమాండ్



అమరావతి, ఫిబ్రవరి 23 (మనప్రజాప్రతినిధి): రాజమహేంద్రవరంలో కల్తీ పాలు సేవించి ఐదుగురు మృతి చెందడం, మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురవడం పట్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని పేర్కొంటూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆహార భద్రత విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలకే ముప్పు తెచ్చిందని జగన్ విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై నిర్దాక్షిణ్యంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు అత్యుత్తమ వైద్యసేవలు అందేలా చూడాలని, వారి ఆరోగ్య పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. అవసరమైతే ప్రత్యేక నిపుణుల బృందాలను నియమించి సమగ్ర వైద్యం అందించాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ఈ ఘటనపై అత్యవసరంగా దృష్టి సారించి బాధితులకు పూర్తి న్యాయం చేయాలని జగన్ స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం విషయంలో రాజీ ఉండకూడదని పేర్కొన్నారు.

# కల్తీ పాల బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం

- ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన
- ఆసుపత్రి ఖర్చులు ప్రభుత్వ భారం
- డెయిరీ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు




రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 23 (మనప్రజాప్రతినిధి): రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్ ప్రాంతాల్లో కల్తీ పాలు వినియోగంతో మృతి చెందిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు. కోరుకొండ మండలం నరసాపురం గ్రామంలోని వరలక్ష్మీ మిల్క్ డెయిరీ నుంచి 106 కుటుంబాలకు రోజూ పాల సరఫరా జరుగుతోందని అధికారులు తెలిపారు. ఆ డెయిరీ నుంచి వచ్చిన పాలను సేవించిన అనంతరం అనారోగ్యానికి గురైనట్లు నిర్ధారించారు. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా, ఇద్దరు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. మరో ఎనిమిది మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. మృతుల్లో ముగ్గురు 70 ఏళ్లు దాటిన వారు కాగా, ఒకరు 58 ఏళ్ల వయసు వారు ఉన్నారు. బాధితుల నుంచి నమూనాలు సేకరించి హైదరాబాద్, విశాఖపట్నంలోని ప్రయోగశాలలకు పరీక్షల కోసం పంపించారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. డెయిరీ నిర్వాహకుడు అద్దాల గణేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.




# జమ్ముకశ్మీర్‌లో ఎదురుకాల్పులు..

- ముగ్గురు ఉగ్రవాదులు మృతి
- కిస్ట్‌వార్ జిల్లాలో ఉత్కంఠ పరిస్థితి
- జైష్ ఎ మహమ్మద్‌తో సంబంధం అనుమానం
- మంచుతో కప్పుకున్న అడవుల్లో ప్రత్యేక దాడి



జమ్మూకశ్మీర్, ఫిబ్రవరి 23 (మనప్రజాప్రతినిధి): జమ్ముకశ్మీర్ రాష్ట్రంలోని కిస్ట్‌వార్ జిల్లాలో భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య తీవ్ర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ముగ్గురు ఉగ్రవాదులు మృతిచెందినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మంచుతో కప్పుకున్న పర్వత ప్రాంతంలో ఈ ఘటన జరగడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఛత్రూ అటవీ ప్రాంతంలోని ఓ కొండ దిగువన గల మట్టి ఇంట్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న స్పష్టమైన సమాచారం అందడంతో భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని ముట్టడి చేశాయి. లొంగిపోవాలని హెచ్చరించినప్పటికీ, ఉగ్రవాదులు ముందుగా కాల్పులు ప్రారంభించారు. దాంతో భద్రతా దళాలు ప్రతిగా కాల్పులు జరిపాయి. కొన్ని గంటల పాటు కొనసాగిన కాల్పుల్లో ఇంట్లో దాగి ఉన్న ముగ్గురు ఉగ్రవాదులు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల్లో ఒకరు పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహమ్మద్ సంస్థకు అనుబంధంగా పనిచేస్తున్న కీలక నాయకుడు సైఫుల్లా అయ్యి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఘటన అనంతరం ప్రాంతంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. శాంతి భద్రతల పరిరక్షణ కోసం అదనపు దళాలను మోహరించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఉగ్రచర్యలను అడ్డుకునేందుకు భద్రతా వ్యవస్థ మరింత అప్రమత్తంగా ఉందని అధికారులు స్పష్టం చేశారు.

# చేర్యాల నూతన ఎస్సైగా అపూర్వరెడ్డి




మనప్రజాప్రతినిధి//చేర్యాల: జనగామనియోజకవర్గం,చేర్యాల పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా అపూర్వరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూడ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, గంజాయి,డ్రగ్స్,తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజల ఫిర్యాదులపై త్వరితగతిన స్పందిస్తూ,న్యాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అక్రమ వ్యాపారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మండలంలో ఎలాంటి ఫిర్యాదులు ఉన్న నేరుగా పోలీసు స్టేషన్ లోసంప్రదించాలన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సైకి స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వేముల నవీన్ గజ్వేల్ టౌన్ పోలీస్ స్టేషన్ కు బదిలీపై వెళ్ళారు.

# ఉపాధి హామీ పనులు ప్రారంభం



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్: రాంపల్లి గ్రామం లో సోమవారం ఉపాధి హామీ పనులు గ్రామ సర్పంచ్ బొమ్మ మల్లయ్య, గ్రామ పాలకవర్గశీ సభ్యులు,పంచాయతీ సెక్రటరీ అనిల్, టెకినికల్ అసిస్టెంట్ జి సురేష్ ప్రారంభించారు. కార్యక్రమం లో భాగంగా రోడ్డు విస్తరణ పనూలు ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఉపాధి హామీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయాలు ఫ్యాషన్ కాదు

మనప్రజాప్రతినిధి// ఫిబ్రవరి 24:రాజకీయాల్లోకి రావాలి అని ఉన్న నిరాశ చెందుతున్న యువతకి రాజకీయాలు ఫ్యాషన్ కాదు... అది ఒక బాధ్యత యువతకు " పాఠం ఓటమి కాదు.. అవకాశం! నేటి రాజకీయాల్లో ఒక ప్రమాదకరమైన భావన పెరుగుతోంది.." మనం ఎంత పని చేసినా గుర్తింపు రావడం లేదు " అనే నిరాశ. ముఖ్యంగా నిజాయితీతో ఆలోచనతో రాజకీయాల్లోకి వచ్చిన యువతలో ఈ బాధ ఎక్కువగా కనిపిస్తోంది. వారసత్వ రాజకీయాలు, నాయకుల కొడుకులు, కుటుంబ ఆధిపత్యం.. ఇవన్నీ చూసి చాలామంది యువత వెనక్కి తగ్గుతున్నారు. కానీ ఒక ప్రశ్న అడగాలి.. రాజకీయాలు కుటుంబాల కోసం సృష్టించబడిన వేదిక నా? లేక ప్రజల కోసమా? రాజకీయాలు ఫ్యాషన్ కాదు. ఇది ఫోటోలు, ఫ్లెక్సీలు, సోషల్ మీడియా లైకుల ఆట కాదు. ఇది ఒక బాధ్యత తో కూడిన సేవ. ఇది ఒక దీర్ఘకాల పోరాటం. యువతా గుర్తించండి ఓటమి మీద విజయం సాధించిన కథ ఇది. ఇక్కడ నేను మీకు చెప్పడానికి ఒక కారణం ఉంది. నేటి యువత రాజకీయాల్లోకి రావడానికి భయపడుతున్నారు.. నిరాశ చెందుతున్నారు.. అది చూసే నేను చెప్తున్న ఒక చిన్న పాఠం " ట్రై అగైన్ ' ఈ ట్రై అగైన్ అనే పోయెమ్ నిజానికి విలియం ఎడ్వర్డ్ హిక్సన్ రాసిన ప్రసిద్ధ కవిత. ఆ కవితలో చెప్పిన " స్పైడర్" కథ మనందరికీ శాశ్వత పాఠం. మన ఈ కథలో " స్పైడర్" నిజమైన హీరో. ఒక రాజు వరస ఓటముల తో నిరాశలో కూర్చుంటాడు " నేను ఎన్నిసార్లు ఓడిపోవాలి "? అని తనను తాను ప్రశ్నించుకుంటాడు. అప్పుడే అతని దృష్టి ఒక సాలీడు పైపడుతుంది. అది గూడు కట్టే ప్రయత్నం చేస్తుంది. దారం తెగిపోతుంది. మళ్లీ ప్రయత్నం చేస్తుంది. మళ్లీ విఫలమవుతుంది. కానీ పదోసారి? అది గూడు పూర్తి చేస్తుంది. ఆ రాజుకు అప్పుడు అర్థమవుతుంది.." నా ఓటమికి కారణం.. శక్తి లేకపోవడం కాదు.. ప్రయత్నం చేయకపోవడమే." ఆ రాజు మళ్ళీ యుద్ధానికి సిద్ధమవుతాడు. ఈసారి యుద్ధంలో గెలుస్తాడు. దీనికి కారణం నిరాశను జయించి ప్రయత్నం చేయడమే. ఓ యువతా... మీ సమస్య ఓటమి కాదు.. అసహనం నేటి యువతలో ప్రధాన సమస్య: వెంటనే గుర్తింపు రావాలి వెంటనే పదవి రావాలి వెంటనే ఫలితం రావాలి కానీ రాజకీయాలు,మారాథన్, స్ప్రింట్.కాదు నాయకుల కొడుకులు వస్తారు. వారికి కుటుంబ నేపథ్యం ఉంటుంది. కానీ వాటిని గెలిపించేది కుటుంబం కాదు. ప్రజలు. మీరు ప్రజల మధ్య పని చేస్తే మీరు వారి కష్టాల్లో నిలబడితే మీరు ప్రజల నమ్మకం గెలుచుకుంటే ఏ కుటుంబ రాజకీయము మీ ఎదుగుదలను ఆపలేదు. గుర్తుంచుకోండి.. ప్రజలే అసలైన వారసత్వం వారసత్వ రాజకీయాలు రెండు రకాలుగా ఉంటాయి 1. కుటుంబ వారసత్వం 2. ప్రజల నమ్మక వారసత్వం మొదటిది పేరు మీద వస్తుంది.. రెండవది పోరాటంతో వస్తుంది మొదటి త్వరగా వస్తుంది రెండవది నిలకడగా ఉంటుంది. చరిత్ర చెబుతోంది.. పోరాడి వచ్చిన నాయకులే చిరస్థాయిగా నిలిచారు. యువతకు పిలుపు యువతఇలా అనుకోవాలి " నాయకుల కొడుకులు వచ్చారు.. మేమేం చేయలేం ".. కాదు" ప్రజలే నా బలం" అని ముందుకు సాగాలి మీ పని గుర్తించకపోతే ఇంకా మెరుగ్గా చేయండి. మీకు అవకాశం ఇవ్వకపోతే మీకు మీరే అవకాశంగా మారండి. మీరు విఫలమైతే మళ్లీ ప్రయత్నించండి మళ్లీ ప్రజల్లోకి వెళ్ళండి మళ్లీ వారి నమ్మకం గెలుచుకోండి. నిజాయితీతో చేసిన పని ఎప్పుడూ వృధా కాదు నేటి రాజకీయాలు అత్యంత అవసరమైనది క్రమశిక్షణ సహనం సిద్ధాంత నిబద్ధత దీర్ఘకాల దృష్టి నిరాశలోపడే యువత ప్రమాదంలో పడతారు. కానీ నిరాశను శక్తిగా మార్చుకున్న యువత.. చరిత్రను సృష్టిస్తారు.. చరిత్రలో నిలుస్తారు. ముగింపు.. స్పైడర్ మాదిరిగా ఒకసారి కాదు పదిసార్లు కాదు అవసరమైతే వందసార్లు ప్రయత్నించండి ఎందుకంటే రాజకీయాల్లో నిజమైన విజయం పదవి కాదు " ప్రజల గుండెల్లో స్థానం" యువతా..... ఫ్యాషన్ కోసం కాదు... పవర్ కోసం కాదు...... ప్రజల కోసం రాజకీయం చేయండి. ఏదో ఒక రోజు గుర్తింపు తప్పక వస్తుంది. నీ బలం అర్థం అవుతుంది అది ఆలస్యం అవుతుందేమో కానీ అది శాశ్వతం అవుతుంది

# రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి


హుస్నాబాద్ ఫిబ్రవరి//మన ప్రజాప్రతినిధి. 23): రాష్ట్ర వ్యాప్తంగా ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఈ రోజున చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపు మేరకు హుస్నాబాద్ మండల ఆశ కార్యకర్తలను ముందస్తుగా హుస్నాబాద్ పోలీస్ లు అరెస్టు చేయడం జరిగింది అరెస్టు అయినా ఆశ కార్యకర్తలకు బి ఆర్ యస్ పార్టీ పక్షాన సంఘీ భావం తెలిపి వారి పోరాటానికి మద్దతు తెలుపడం జరిగింది అనంతరం ఆశ కార్యకర్తల తో కలిసి విలేకరుల తో మాట్లాడడం జరిగిందిఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కారించడం లో ప్రభుత్వం విఫలంఆశ కార్యకర్తలను ప్రభుత్వం అరెస్టు చేయిశీచడం అన్యాయంఆశ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి బి ఆర్ యస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి ఆశ కార్యకర్తలు న్యాయమైన డిమాండ్లు పరిష్కారించాలని కోరుతూ ఈ రోజున రాష్ట్ర వ్యాప్తంగా చాలో హైదరాబాద్ తరలి పోతారని అనే సమాచారం తో ముందస్తుగా పోలీసులు ఆశ కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని బి ఆర్ యస్ పార్టీ ఖండిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలపెట్టుకోవడం లో పూర్తి గా విఫలం చెందింది ఆశ కార్యకర్తలు రోజు అంత గ్రామల ల్లో పట్టణ వార్డుల్లో ఇల్లు పిల్లల్ని వదిలి పెట్టి ప్రజల కోసం కష్టపడుతు జీవితం గడుపుతారు చాలి చాలని జీతాలతో కాలం గడుపుతున్నారు నిత్య అవసర వస్తువులు ధరల మీద ధర లు పెరుగుతున్నాయి పిల్లల ఉన్నత చదువులు ఎలా చదువుపిస్తారు అని ప్రభుత్వన్ని ప్రశ్నినిస్తున్నాం ఆశ కార్యకర్తల దాదాపు 15 సంవత్సరాల పైగా ప్రభుత్వం ఇచ్చే పారితోషకశీ చిన్న జీతాలతో పని



చేస్తున్నారు ఆశ కార్యకర్తల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వనికి కనికరం లేకుండా పోయిశీది కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడుగుతే పోలీస్ లచే అరెస్టు చేయంచడం భయభ్రాంతులకు గురి చేయడం అదే పనిగా పెట్టుకుంది తప్ప సమస్య లను పరిష్కారించడం లో పూర్తి గా విఫలం చెందింది కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబించే విధానలను ప్రజలుఅవలంబించే గమనిస్తున్నారు తెలుపుతున్నాం కనీసం ఇప్పటి కైన ఆశ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను పరిష్కారించాలని బి ఆర్ యస్ పార్టీ కోరుతుంది లేకుంటే ఆశ కార్యకర్తలు చేసే పోరాటానికి మద్దతు తెలిపి వారు చేసే పోరాటం లో ప్రత్యక్షంగా పాల్గొని మద్దతు తెలుపుతు వారి సమస్యలు పరిష్కారించేశీత వరకు ప్రభుత్వన్ని వదిలి పెట్టాం అని తెలుపుతున్నాం ఈ రోజున పోలీస్ లు ముందస్తు గా అరెస్టు చేసిన వారి లో ఆశ కార్యకర్తలు తగరపు భాగ్య లక్ష్మి వర్ష శోభారాని గడిపే అనసూర్య దప్పట జ్యోతి ఆకారపు కోమల పున్న అనిత పచ్చుమట్ల స్వరూప గడిపే రజిత మల్లిక లలిత తదితరులు పాలుగోన్నారు

# ప్రజల సమస్యల చట్టపర పరిష్కారానికి తక్షణ కృషి

మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:ప్రజావాణి కార్యక్రమంసూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంకె నరసింహ ఐపిఎస్, ఎస్పి సూర్యాపేట జిల్లా.పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ జిల్లా పోలీస్ కార్యాలయం నందు పిర్యాదుదారులతో మాట్లాడినారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన పిర్యాదుదారుల నుండి పిర్యాదులు స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తక్షణ ఆదేశాలు, సూచనలు చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు బరోసా




కల్పించాలి అన్నారు.ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజలు పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి, మెదక్ పట్టణ నూతన కార్యవర్గ కమిటీ ఏర్పాటు

మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఫిబ్రవరి 23,:తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి ఆధ్వర్యంలో మెదక్ పట్టణ నూతన కార్యవర్గ కమిటీని ఆదివారం ఉదయం 10 గంటలకు మెదక్ పట్టణంలోని టీఎన్జీఓ భవనంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేగ్గళం సీతాలత శ్రీదేవి , ప్రత్యేక అతిథిగా మెదక్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు శంకర్ గౌడ్ , ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి హాజరయ్యారు. వారి సమక్షంలో మెదక్ పట్టణ నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేసి, శాలువాలు,

# రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

మనప్రజాప్రతినిధి//23/02/2026సోమవారం: తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల తో పాటు పదో తరగతి విద్యార్థులకు రోడ్డు భద్రతపై తిరుమలగిరి ఎస్సై గుత్తా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా ఎస్పీ ఆదేశానుసారం మరియు అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డుపై ప్రయాణించే ముందు తమ కుటుంబ సభ్యులను గుర్తుంచుకోని వెళ్లాలని ఆయన కోరారు అధిక స్పీడుతో ప్రయాణం చేసి ప్రమాదానికి గురైయితే తమ కుటుంబామంతా వీధిన పడే అవకాశం ఉందని అని అన్నారు , విద్యార్థులు యువకులు బైకులపై ముగ్గురితో కూడిన ప్రయాణం



చేయడం నేరమని ఇది ప్రమాదాలకు సంకేతమని ఆయన అన్నారు అలాగే వాహనదారులు హెల్మెట్ సీట్ బెల్ట్ ఇన్సూరెన్స్ డ్రైవింగ్ లైసెన్స్ ఫిట్నెస్ తదితర గుర్తింపు పత్రాలు తప్పకుండా ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ దామర శ్రీనివాస్ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు

# బాధిత కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల ఫిబ్రవరి,23: వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కొలనూరు గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తల కుటుంబాలను వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు నేడు పరామర్శిం చారు గ్రామంలో వరుసగా చోటుచేసుకున్న మరణాలతో ఆయా కుటుంబాల్లో నెలకొన్న విషాద ఛాయలను చూసి ఆయన చలించిపోయారు. కాంగ్రెస్ నాయకులు వీరబోయిన తిరుపతి తల్లి లక్ష్మి గారు అనారోగ్యంతో కన్నుమూయగా, వారి నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మరియు, గత 20 రోజుల క్రితం మృతి చెందిన పార్టీ కార్యకర్త తుమ్మల స్వామి కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన పెద్ది పరుశరాములు తండ్రి నరసయ్య గారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు."పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు, నాయకులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది.



బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను," అని ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ గారు పేర్కొన్నారు.ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# అరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రత అవగాహన వారోత్సవాలు..

మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:సూర్యాపేట పట్టణంసామాజిక అంశాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి..రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ పట్ల విద్యార్థులు ఇతరులను చైతన్యవంతం చేయాలి..జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి..రోడ్డు ప్రమాదాలు నివారించడం, ప్రమాదాలలో ఏ ఒక్కరు ప్రాణాలు కోల్పోకుండా సురక్షితంగా గమ్యం చేరడం లక్ష్యంగా రాష్ట్ర పోలీస్ శాఖ నిర్వహిస్తున్న అరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలలో భాగంగా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా వారం రోజులపాటు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. దీనిలో భాగంగా సూర్యాపేట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక సాయి గౌతమి కళాశాల నందు ఈరోజు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి హాజరై రోడ్డు భద్రత పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం సంభవించడం అంటే ఒక కుటుంబం రోడ్డు పాలవడమని







ఇలాంటి సంఘటనలు నిత్యం అనేకం చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే అవగాహన ముందస్తు జాగ్రత్తలే మార్గమని తెలిపారు. విద్యార్థి దశ నుండే సామాజిక అంశాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ పట్ల విద్యార్థులు అంబాసిడర్స్ గా ఉండి తల్లిదండ్రులను చుట్టుపక్కల ఉన్న ప్రజలను పెద్దవారిని నిరక్షరాశులను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ఉన్నదని గుర్తు చేశారు. పిల్లలు వాహనాలు నడపకూడదని తెలిపారు, తల్లిదండ్రులు పెద్దలు హెల్మెట్ ఉపయోగించేలా వారికి తెలియపరచాలన్నారు. విద్యార్థి దశ నుండి క్రమశిక్షణ పట్టుదలతో కృషి చేయాలని ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉండాలని కోరారు.ఈ కార్యక్రమం నందు హాజరైన పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి ప్రమాదాల నిర్మూలనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం నందు కళాశాల యాజమాన్యం, రెండవ పట్టణ ఎస్సై శివతేజ, విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ నుండి భద్రాచలం బాసర కు నూతన ఆర్టీసీ బస్సు ప్రారంభించారు

హుస్నాబాద్ ఫిబ్రవరి// మన ప్రజాప్రతినిధి. 23):హుస్నా బాద్ నుండి భద్రాచలం, బాసర, ఆదిలాబాద్ కు నూతన ఆర్టీసీ బస్సు సర్వీసులను డిపో మేనేజర్ వెంకన్నతో కలిసి హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి, పాలకవర్గ సభ్యులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బస్సులో టికెట్ తీసుకొని కొద్ది దూరం ప్రయాణించారు. హుస్నాబాద్ నుండి ఆధ్యాత్మిక, దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో మూడు నూతన బస్సు సర్వీస్ లను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ వెంకన్న తెలిపారు. పొద్దున, మధ్యాహ్నం, సాయంత్రం మూడు షిఫ్టుల్లో అదిలాబాద్ కు ఎక్స్ ప్రెస్ బస్సులు నడుపనున్నట్లు వెల్లడించారు. ప్రయాణికులు బస్సు సర్వీస్ లను సద్వినియోగం



చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు ఆకుల రజిత,గోపగోని శోభన్, వైద్యం కిరణ్,కొండ రజిత, బూరుగు లత,కేశవేని రమేష్, పిల్లి తిరుపతి, చెన్న బోయిన అనూష, బత్తుల స్వరూప,పూదరి వరప్రసాద్, ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పదవ తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు....





మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డిమార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షల నిర్వహణలి 98 పరీక్షా కేంద్రాలలో 16975 మంది విద్యార్థులు హాజరులిపదవ తరగతి పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్ ఖమ్మం జిల్లాలో పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలనిఅదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సోమవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూలి మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించే పదవ తరగతి పరీక్షలలో మన జిల్లాకు చెందిన 16975 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరవుతు న్నట్లు, వీరి కోసం 98 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద అవసరమైన మేర భద్రత ఏర్పాట్లు కల్పించాలని అదనపు కలెక్టర్ పోలీస్ అధికారులకు సూచించారు. 6 ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు ఏర్పాటు చేయాలని, ప్రతి ఫ్లయింగ్ స్క్వాడ్ లో డిప్యూటీ తహసిల్దార్, ఎస్ఐ సభ్యులుగా ఉండాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటుకు సిబ్బంది వివరాలు అందించాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షా సమయంలో ప్రతి పరీక్షా కేంద్రం చుట్టుపక్కల ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని అన్నారు. ప్రశ్న పత్రాల తరలింపుకు సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో పెట్టాలని అన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా అవసరమైన రూట్ లలో బస్సులు నడపాలని అదనపు కలెక్టర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షల నేపథ్యంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. ప్రశ్న పత్రాలను సమీప పోలీస్ స్టేషన్ నందు భద్రపరిచి పరీక్ష రోజు బందోబస్తుతో పరీక్ష కేంద్రాలకు సకాలంలో సరఫరా చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమీషనర్ వై. లక్ష్మీప్రసాద్, విద్యాశాఖ ఏడి చావా శ్రీనివాస్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. రామారావు, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పాలన అంశాల పట్ల అధికారులు దృష్టి పెట్టాలి.....





మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఫిబ్రవరి 27న జరిగే దిశ సమావేశానికి ప్రతి ఒక్క అధికారి హాజరు కావాలి పరిపాలన అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఖమ్మం పాలన అంశాల పట్ల అధికారులు దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం పరిపాలన అంశాలపై జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి సత్తుపల్లిలో అటవీ వస్తువులు విక్రయం కోసం ప్రత్యేకంగా మార్ట్ నిర్మాణానికి గ్రామీణ అభివృద్ధి శాఖ తరపున 10 లక్షల రూపాయలు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. నేలకొండపల్లి, ధంసలాపురం, వెంకటగిరి వద్ద ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై రిపోర్టు అందించాలని కలెక్టర్ ఆదేశించారు .రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ భారతి, సాదా బైనామ దరఖాస్తుల పరిశీలన పురోగతిపై రెగ్యులర్ రిపోర్ట్ అందించాలని, ప్రతి పి.ఓ.బి. దరఖాస్తు ఎవరి దగ్గర ఎన్ని రోజులు పెండింగ్ ఉంటుందో మానిటర్ చేసేందుకు ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భూ సేకరణ సంబంధించి పెండింగ్ కోర్టు కేసులకు సకాలంలో కౌంటర్ ఫైల్ చేయాలని అన్నారు. వైరా, ఏదులాపురం మున్సిపాలిటీ లలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు స్థలం ఫైనల్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. యూఎల్బీ పరిధిలో పెండింగ్ పనులపై రెగ్యులర్ గా సమావేశాలు నిర్వహించాలని, పీఎం శ్రీ పాఠశాలలకు సంబంధించిన పనుల బిల్లులు త్వరగా తయారు చేసి క్లెయిమ్ చేయాలని అన్నారు.ఫిబ్రవరి 27 న జరిగే దిశ సమావేశానికి ప్రతి ఒక్క అధికారి సమాచారంతో అందుబాటులో ఉండాలని, స్త్రీ నిధి రుణాల రికవరీపై దృష్టి సారించాలని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. .

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి...




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిలా:జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి పజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఖమ్మం ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరిం చారు.వేంసూరు మండలం మర్ల పాడు గ్రామానికి చెందిన భీమిరెడ్డి పుల్లారెడ్డి భరణిపాడు నుంచి పర్వతాపురం ఆర్ అండ్ బీ రోడ్డు గుంతలతో అధ్వాన్నం గా ఉందని, భరణి పాడు కాలువ మీద ఉన్న వంతెన శిథిలావస్థలో ఉందని, వీటికి అవసరమైన మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈఈ ఆర్ అండ్ బీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఖమ్మం నగరం ఖానాపురం హవేలికి చెందిన ఎన్. నటరాజ్ తాను దివ్యాంగుడినని తనకు సొంత ఇల్లు లేనందున ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈఈ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.నేలకొండపల్లి మండలం అప్పల నర్సింహాపురం గ్రామస్తులు తమ గ్రామంలో సెల్ఫోన్ సిగ్నల్ లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని, గ్రామ ప్రజల ఇబ్బందుల దృష్ట్యా జియో టవర్ నిర్మించుటకు అనుమతించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ డి విభాగం పర్యవేక్షకులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.వైరా మున్సిపాలిటీ 14వ వార్డుకు చెందిన ఎస్సీ కాలనీ వాసులు నిరుపయోగంగా ఉన్న ఎన్.ఎస్.పి. కెనాల్ స్థలంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వైరా మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, తదితరులు పాల్గొన్నారు.

# రుక్మాపూర్ రైతులకు నష్టపరిహారం చెక్కుల పంపిణీ



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఫిబ్రవరి 23మెదక్ జిల్లా, చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామంలో ఏజెన్సీ కంపెనీ ద్వారా వరి సాగు చేసి నష్టపోయిన రైతులకు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్ల నవీన్ కుమార్, గ్రామ సర్పంచ్ నవీన్, పీఏసీఎస్ ఛైర్మన్ మ్యాకల పరమేశ్, ఏఎంసి డైరెక్టర్లు స్టాలిన్ నర్సింలు, ఫకీర్ నాయక్, అన్నం ఆంజనేయులు, మోజమిల్, బాల్ రెడ్డి, వడియారం సర్పంచ్ సాయి కుమార్ గౌడ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు అంజ గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు రాంపూర్ మాజీ సర్పంచ్ కాశబోయిన భాస్కర్, సతీష్, సంద్రుగు శ్రీకాంత్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో జాగిలాల పాత్ర కీలకం పోలీస్ కమిషనర్





మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:పోలీస్ కమిషనర్ కార్యాల యం ఖమ్మంపోలీస్ జగిలాలు (పోలీస్ డాగ్స్ ) నేర పరిశోధన, భద్రతా చర్యలు, మాదక ద్రవ్యాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్నాయిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. హైదరాబాదులోని ఐఐటీఏ మొయి నాబాద్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొంది ఖమ్మం పోలీస్ కమిషరెట్ కు కేటాయిం చబడిన పింకీ, రోక్సీ అనే రెండు పోలీస్ జగిలాలతో డాగ్ హ్యాండ్లర్ హ్యాండ్లర్ బి.రవి, టి. అచ్యుత్, కె.గౌతమ్ కుమార్సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయం లో పోలీస్ కమిషనర్ కి రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లా డుతూ శిక్షణా సామర్థ్యం వల్ల పోలీసులు విభిన్న ఆపరేషన్లలో పోలీస్ జగిలాలను వినియోగిస్తున్నారని తెలిపారు. విశ్వాసానికి మారు పేరుగా నిలిచే జాగిలాలు పోలీస్ శాఖకు నేర పరిశోధనలో కీలకంగా మారుతున్నాయిని, హత్యలు, దోపిడీలు, దొంగతనాలు జగిన సమయంలో నిందితులను పట్టించడం,సంఘ విద్రోహులు అమర్చే పేలుడు పదార్థాలను గుర్తించి భారీ ప్రాణ, ఆస్తి నష్టం నివారించడంలో పోలీసు జాగిలాలు అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నాయిని అన్నారు. జిల్లా పోలీస్ పరేడ్ మైదానం దగ్గర పోలీస్ జగిలాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గదులను సరైన వసతులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.బెల్జియం బ్రెడ్ చెందిన నార్కోటిక్ పసిగట్టే డాగ్ పింకీ, లాబ్రడార్ రిట్రీవర్ బ్రెడ్ చెందిన పేలుడు పదార్థాలను గుర్తుంచే డాగ్ రోక్సీ.

# తెలంగాణ రాష్ట్ర 4 వ పోలీస్ స్పోర్ట్స్-మీట్‌లో జిల్లా పోలీసుల ఉత్తమ ప్రదర్శన





మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక కొత్తగూడెం జిల్లా:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయం 19 పతకాలతో (06-గోల్డ్, -06 రజతం,07-కాంస్యం) సత్తా చాటిన జిల్లా పోలీస్ క్రీడాకారులు క్రీడాకారులను అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గత వారం రోజులుగా సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 4 వ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా పోలీసు క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 19 పతకాలు (06-బంగారు, 06-రజత, 07-కాంస్య) సాధించి జిల్లాను ముందు వరుసలో నిలిపారని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విజేతలకు పతకాలు అందజేసిన ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.గెలుపు ఓటములు సహజమని,విజేతలు జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శన ఇవ్వడానికి కృషి చేయాలని,ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా తమ లోపాలను సరిదిద్దుకొని ముందుకు సాగాలని సూచిం చారు.జిల్లాకు పతకాలు తీసుకువచ్చిన క్రీడా కారులందరిని ప్రత్యేకంగా అభినందిం చారు.టేబుల్ టెన్నిస్ ఓపెన్ సింగిల్స్ విభాగంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్ రజత పతకాన్ని సాధించారు.45 సంవత్సరాల పైన బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ రజత పతకాన్ని సాధించారు.స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఇ.శ్రీనివాస్ నాయక్ బాడ్మింటన్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారు.పాల్వంచ సిఐ కే.సతీష్ టెన్నిస్ టీం విభాగంలో రజత పతకాన్ని సాధించారు.వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు టెన్నిస్ డబుల్స్ విభాగంలో రజత పతకాన్ని సాదించారు.కొత్తగూడెం 3టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిసున్న బి.రత్నకుమారి నాలుగు పతకాలను సాధిం చినది.మహిళల బాక్సింగ్ విభాగంలో బంగారు పతకం,ట్రేడిషనల్ యోగా విభాగంలో బంగారు పత కం,జిమ్నాస్టిక్స్ విభాగంలో రజతం,కళాత్మక యోగా విభాగంలో ఒక కాంస్య పతకం సాధించారు.ఏఆర్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ ప్రవీణ్ బ్యాడ్మింటన్ సింగిల్స్ లో బంగారు పతకం,మిక్సడ్ డబుల్స్ విభాగంలో రజత పతకాన్ని సాధించారు.జిల్లా ఏఆర్ విభాగంలో విధులు నిర్వర్తిసున్న మహిళా పోలీసు కానిస్టేబుల్ డి.సుష్మ 100 మీటర్లు,200 మీటర్లు పరుగు పందెం విభాగాలలో బంగారు పతకాలు సాధించారు.చంద్రుగొండ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న బి.రజని ఖోఖో,రిథమిక్ యోగా విభాగాలలో 02 కాంస్య పతకాలు సాధించారు.ఏఆర్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ వి.వంశీ 100 మీటర్లు,200 మీటర్ల పరుగు పందెం విభాగాలలో 02 కాంస్య పతకాలను సాధించారు.అశ్వాపురం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్ నాగస్వరూప బ్యాడ్మింటన్ మిక్సడ్ డబుల్స్ విభాగంలో బంగారు పతకం,విమెన్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించారు.

# తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి మెదక్ పట్టణ నూతన కార్యవర్గ కమిటీ ఏర్పాటు




మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఫిబ్రవరి 23,:తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి ఆధ్వర్యంలో మెదక్ పట్టణ నూతన కార్యవర్గ కమిటీని ఆదివారం ఉదయం 10 గంటలకు మెదక్ పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేగ్గళం సీతాలత శ్రీదేవి , ప్రత్యేక అతిథిగా మెదక్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు శంకర్ గౌడ్ , ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి హాజరయ్యారు. వారి సమక్షంలో మెదక్ పట్టణ నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేసి, శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి అధికారికంగా ప్రకటించారు.గౌరవ అధ్యక్షులు: సయ్యద్ మునీర్ , పట్టణ అధ్యక్షులు: వేగ్గళం సీతాలత శ్రీదేవి , ప్రధాన కార్యదర్శి: పుట్టి చంద్రకళ , ఉపాధ్యక్షులు: షేక్ మూస , సహ కార్యదర్శి: ఎ. నరేష్ , సలహాదారు: మహమ్మద్ షబానా . ఈ సందర్భంగా ప్రసంగించిన వక్తలు పట్టణ స్థాయిలో దివ్యాంగుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, పాలన వ్యవస్థలో ప్రాతినిధ్యం కల్పించడంలో నూతన బాధ్యతలు స్వీకరించిన కార్యవర్గం చిత్తశుద్ధితో, చురుకుదనంతో పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు దివ్యాంగుల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. మెదక్ పట్టణంలోని దివ్యాంగుల సమస్యలు ప్రత్యేక పింఛన్లు, ఉపాధి హామీ అవకాశాలు, ఆసరా పథకాలు, విద్యా-వైద్య హక్కులు, పునరావాసం, వసతి సౌకర్యాల లభ్యత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.అందుకు అనుగుణంగా సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు నూతన కమిటీ వెల్లడించింది. ఈ సమావేశానికి రాష్ట్ర, జిల్లా, పట్టణ స్థాయిలకు చెందిన దివ్యాంగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందించిన పోలీస్ కమిషనర్




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మంరాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో పతకాలను సాధించిన ఖమ్మం కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.ముందుగా పతాకాలను సాధించిన పోలీస్ క్రీడాకారులు పోలీస్ కమిషనర్ కార్యాలయం ఒక్కొక్కరిని ప్రత్యేకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఖమ్మం కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో క్రీడల్లో అద్భుత ప్రదర్శనతో 15 బంగారు పతకాలు, 8 రజిత పతకాలు, 16 కాంస్య పతకం మొత్తం 39 పతకాలను కైవసం చేసుకోవడం అభినందనీయమని పోలీస్ కమిషనర్ అన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో జాతీయ స్థాయి పోలీస్ క్రీడల్లో ప్రతిభను కనబరిచి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. పతకాలను సాధించేందుకుగా ముమ్మరంగా సాధన చేయాలని, క్రీడల్లో రాణించే వారికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పోలీస్ కమిషనర్ అన్నారు.కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఏఆర్) కుమారస్వామి,అడిషనల్ డీసీపీ విజయబాబు,ఏ ఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ఐలు సురేష్, సాంబశివరావు, క్లూస్ టీం ఇన్స్పెక్టర్ నరేష్ పాల్గొన్నారు.

# రజకులపై దాడి అమానుషం జిల్లా ఉపాధ్యక్షులుదొంతి గోపాల్ రజక



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఫిబ్రవరి 23:నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో కుల వివక్షతో నిరుపేద రజక కుటుంబంపై జరిగిన దాడిలో పసిపాప మరణించడం అమానుషం అని దాడిని జిల్లా రజక సంఘం ఖండిస్తుంది అని జిల్లా రజక సంఘం ఉపాధ్యక్షులు దొంతి గోపాల్ రజక చేగుంట లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అన్నారు. ఇటువంటి ఘటన సభ్య సమాజానికి సిగ్గుచేటుఅని ఘటనకు పాల్పడ్డ వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని బాధితులు తెలిపిన వివరాల ప్రకారం దాడికి కారణమైన నిందితులను తప్పించేందుకు నామమాత్రపు కేసులు పెట్టి రక్షించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారునిపసి పాప మృతికి కారణమైన వారి పై బిఎన్ఎస్ 316, బిఎన్ఎస్ 316(3), జువెనైల్ జస్టిస్ యాక్ట్ 75 ప్రకారం కేసులు పెట్టి,నిందితుల పై చర్యలు తీసుకోవాలి అని కులవివక్షతో రజక కుటుంబం పై దాడి చేసి పసి బిడ్డ మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

# ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి
## ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
## 25 మంది సర్వేయర్లకు లైసెన్స్ పత్రాల పంపిణీ



మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి -23:లైసెన్సుడు సర్వేయర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదా యంలో సోమవారం 25 మంది సర్వేయర్లకు లైసెన్స్ పత్రాలు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకొని, పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన జిల్లాకు చెందిన 66 మంది సర్వేయర్లకు లైసెన్సులు గతంలో అందజేసిందని గుర్తు చేశారు. గత ఏడాది జిల్లాకు చెందిన సివిల్ విభాగంలో ఉత్తీర్ణత సాధించిన వారికి 50 రోజుల పాటు శిక్షణ ప్రభుత్వం అందించిందని, వారిలో శిక్షణ పూర్తి చేసుకొని పరీక్షలో పాస్ అయిన 25 మందికి లైసెన్స్ పత్రాలను అందించామని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు.లైసెన్స్ పొందిన వారు అందరూ వారికి కేటాయించిన మండలాల్లో అందుబాటులో ఉండాలని, ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్, నటరాజ్ సిబ్బంది ఉన్నారు

# పంటలపరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరణ

**గ్రామీణ వ్యవసాయ పరిస్థితులపై సమగ్ర అధ్యయనం--బీజేఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులగ్రామీణభాగస్వామ్య మూల్యాంకనకార్యక్రమంవిజయవంతం**

**-రైతులసమస్యలు,వనరులు,పంటలపరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరణ**



మనప్రజాప్రతినిధి//సిద్ధిపేటనియోజకవర్గం.ఫిబ్రవరి23:సిద్ధిపేట జిల్లా తొర్నాల గ్రామంలో బిజెఆర్ అగ్రికల్చరల్ కాలేజీ విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కార్యానుభవం కార్యక్రమంలో భాగంగా గ్రామీణ భాగస్వామ్య మూల్యాంకన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. గ్రామీణ వ్యవసాయ పరిస్థితులపై ప్రత్యక్ష అవగాహన పొందడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిలిచింది.విద్యార్థులు గ్రామ రైతులతో మమేకమై వారి సాగు విధానాలు, వనరులు, అవసరాలు వారు ఎదుర్కొంటున్న సమస్యలపైసమగ్ర సమాచారం సేకరించారు.గ్రామ పటం, వనరుల పటం, పంటల నిష్పత్తి పట్టిక, వ్యవసాయ కాలచక్రం,ప్రమాణ క్రమపద్ధతి, చపాతీ పటం, పంటల కాలపట్టిక, సమస్యల వృక్షం వంటి పద్ధతుల ద్వారా వ్యవసాయ పరిస్థితులను విశ్లేషించారు.రైతులు పురుగుమందుల అధిక వినియోగం, నీటి వనరుల కొరత, మార్కెటింగ్ సమస్యలు, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు వంటి అంశాలను వెల్లడించారు. ఈ అధ్యయనం ద్వారా రైతులకు శాస్త్రీయ సలహాలు అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు విద్యార్థులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తొర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్తలు డా. పల్లవి, డా. తబస్సుం ఫాతిమా, వ్యవసాయ విస్తరణాధికారి గీతా, ఒగ్గు రాంబాబు,ఒగ్గు బాలకిషన్ వాసూరి ప్రవీణ్, శతరాసి నవీన్, శనిగరం మల్లయ్య, నిమ్మ చంద్రశేఖర్ రెడ్డి, రాంరెడ్డి గ్రామ రైతులు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు...



జలుమూరు:ఫిబ్రవరి 23 (మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక):జలుమూరు మండలం స్థానిక గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కావడంతో గంట ముందుగానే 8 గంటలకు విద్యార్థులు పరీక్ష కేంద్రం చేరుకున్నారు పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులను 8:30 గంటలకు పరీక్షల్లోకి అనుమతించారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను లోపలకు అనుమతించలేదు. తనిఖీ చేసి అనంతరం లోపలకి పంపించారు. మొదటి పరీక్ష రావడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు వారి వెంట వచ్చారు.జలుమూరు ప్రభుత్వ కళాశాలలో సోమవారం జరిగిన మొదటి సంవత్సరం పరీక్షకు 302 మంది విద్యార్థులకు గాను 11 మంది విద్యార్థులు డుమ్మా కొట్టారు అని ప్రిన్సిపల్ జామి.సారిక తెలియజేశారు.ఈ పరీక్షలకు సీటింగ్ స్క్వాడ్. ధనుంజయ్ రావు, డిపార్ట్మెంట్ ఆఫీసర్ ఆర్. విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాలపై కలెక్టర్‌కు ధర్మాన కృష్ణచైతన్య ఫిర్యాదు



నరసన్నపేట:ఫిబ్రవరి 23 (మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక):నరసన్నపేట మండలంలో జరుగుతున్న అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని కోరుతూ వైకాపా యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య సోమవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ను కలిసి విన్నవించారు. కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమం లో పాల్గొన్న ఆయన, మండలంలోని పలు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు.అనంతరం గ్రీవెన్స్ హాల్ బయట విలేకరులతో మాట్లాడుతూ.. తామరపల్లి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కోట్ల రూపాయల విలువైన స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా, నరసన్నపేట పట్టణం నడిబొడ్డున ఉన్న 'రాతికర్ర' చెరువు సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా మూడు అంతస్తుల భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అక్రమ నిర్మాణాలపై స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని ఆయన అసహనం వ్యక్తం చేశారు. స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో గతంలోనే జాయింట్ కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశాం. నియోజకవర్గ స్థాయి నేతలందరం వచ్చి వివరించినా ఆ కట్టడాలను అడ్డుకోవడంలో యంత్రాంగం విఫలమైంది. అందుకే నేరుగా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశాం అని తెలిపారు. వ్యవస్థలపై తమకు నమ్మకం ఉందని, జిల్లా కలెక్టర్ స్పందించి ఈ అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయిస్తారని ఆశిస్తున్నట్లు కృష్ణచైతన్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళీధర్, రాష్ట్ర పొందర కూరాకుల విభాగం అధ్యక్షులు రాజపు అప్పన్న, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు గుప్తా, వైస్ ఎంపీపీ పాగోటి రాజారావు, సర్పంచ్ ముచ్చ గణేష్,మండల ఉప అధ్యక్షులు నేతింటి రాజేశ్వరరావు, వార్డు సభ్యులు రఘుపాత్రుని బుజ్జి , బంకుపల్లి శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎర్రంనాయుడు గారి జయంతి వేడుకలు...
## ఘన నివాళులు అర్పించిన తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు...



నరసన్నపేట:ఫిబ్రవరి 23 (మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక):నరసన్నపేట పట్టణంలో మాజీ కేంద్ర మంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కింజరాపు ఎర్రంనాయుడు గారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణంలోని జట్టు కళాశాల యూనియన్ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి, మార్కెట్లో ఉన్న విగ్రహానికి, అలాగే నరసన్నపేట పార్టీ కార్యాలయంలో ఉన్న చిత్రపటానికి నాలుగు మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎర్రంనాయుడు ప్రజా సేవకు ప్రతీక అని కొనియాడారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన తన కృషి, పట్టుదలతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చురుకుదనం, అభివృద్ధిపై ఉన్న దృఢ సంకల్పం ప్రతి కార్యకర్తకు ఆదర్శమని పేర్కొన్నారు.సామాన్య ప్రజల పక్షాన నిలబడి, రైతుల సమస్యలు, తీరప్రాంత అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణలో ఎర్రనాయుడు గారి పాత్ర ఎంతో విశిష్టమని నాయకులు గుర్తుచేశారు. ప్రజలతో మమేకమై పనిచేసే నాయకత్వం ఆయనదని, రాజకీయాల్లో నైతిక విలువలకు ఆయన నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.